# హనీమూన్ ప్రారంభిస్తుంటే...

వి.జె. ప్రసాద్



"ఒరేయ్! కాముడూ! సామాన్లన్నీ లెక్క పెట్టావా? మొత్తం పదమూడు శాల్తీలుండాలి. సరిపోయేయిరా?"

'ఆఁ సరిపోయేయే బామ్మా! నువ్వూ, నేనూ, పెళ్ళికూతురూ కలిపితే పదహారు అవుతాం"

"ఒరే నా మతిమండా. నీ పెళ్ళికూతురు ఏదిరా? మరిచేపోయానూ! నీకైనా బుద్ధి లేదురా? చూసుకోవద్దా? అమ్మాయేదీ?"

"అది బండిలో నే ఉందే బామ్మా! దాన్ని వేగం పిలువ్వే? జనం మనల్నే చూస్తున్నారే" అని చుట్టూ ఓసారి చూసి సిగ్గుతో మొహం దించుకున్నాడు కామేశ్వర్రావు ఉరఫ్ కాముడు.

"నీ సిగ్గు బొగ్గులవా! అమ్మాయిని నీతో దింపవట్రా? అమ్మాయ్! శాంతా! దిగమ్మా!"

"ఒసేవ్! సోదులూ! హారతి పట్రావే! ఒరేయ్! అమ్మాయి చెయ్యి పట్టుకోరా! అమ్మాయి! నీ కుడిపాదం ముందు పెట్టమ్మా! ఏమయ్యా! భీమశాస్త్రీ! మంత్రాలు చదవ్వయ్యా" అంటూ చకచకా ఆజ్ఞలు జారీ చేస్తూ, బహు పాత్రాభినయం చేస్తూ, మనవణ్ని, మనవడి భార్యని గృహప్రవేశం చేయించారు బామ్మగారు!

"శాస్త్రీ! చీకటిపడగానే వచ్చేయ్! ఆ శుభకార్యం కూడా నీ చేతుల మీదుగా జరిగిపోవాలి" అని భీమశాస్త్రికి అర్థరిచ్చేటప్పటికి "అలాగేనమ్మా! తప్పకుండావస్తా!" అని శాస్త్రి బయలుదేరబోయాడు.

"ఆగవయ్యా! ఆగు! అడుగు ముందుకేసావా! నీ ప్రాణాలు దక్కవు" అని భీమశాస్త్రిని ఒక్క లాగు లాగేడు కామేశ్వర్రావు.

"ఏమే! బామ్మా! నీకు పెళ్ళికి ముందే చెప్పానా! ఇలా శుభాలూ, శోభనాలూ పెట్టొద్దని. నేనూ, నా పెళ్లాం 'హనీమూన్' వెళ్తాం'. అని. మళ్ళీ యిదేమిటే? "శాస్త్రీ నువ్వు యీ రాత్రి వస్తే.....

నఖిలి, మింగేస్తాను జాగ్రత్త. వస్తావా?''

''రాను బాబూ! అమ్మా వస్తా!'' అని బయటికి పరుగెత్తేడు భీమశాస్త్రి 'బతుకుజీవుడా' అనుకుంటూ.

పాపం! బామ్మగారికి కొడుకూ, కోడలూ ఏక్సిడెంట్‌లో పోగా మిగిలిన వంశాంకురం యీ కాముడు.

కాముడ్ని చాలా ముద్దుగా పెంచింది.

కాముడు డిగ్రీ పాసయి బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నాడు.

బామ్మ చాదస్తాలంటే వాడికి ఒళ్ళు మంట. కాని బామ్మ మాటని కాదనలేడు.

పెళ్ళాంతో హనీమూన్ గురించి నిద్దర్లో, మెలుకువలో కూడ కలలు కన్నాడు.

అందుకే ఈ ఒక్క విషయంలో పట్టు పట్టేడు కాముడు.

బామ్మగారు కాముడు మాట కాదనలేక ''సరే! నీ యిష్టం వచ్చినట్లు తగలడరా! నాకేం! అమ్మాయీ!రామ్మా!లో పలికెళ్దాం''. అని ముక్కుకుంటూ లోపలికి దారి తీసింది.

కాముడు మర్నాటి ''మదనపురం హనీమూన్ ట్రిప్'' గురించి కలలు కంటూ తెల్లవార్చేసేడు.

ఆ రాత్రి శాంతకి బామ్మగారి పక్కే శరణ్యం అయింది. పాపం!

ఉదయం కాముడు లేచేటప్పటికే బామ్మగారు ఆవకాయతో సహా పదకొండు సామాన్లు సర్దేశారు.

కొత్త దంపతులు గబ గబా రెడీ అయ్యారు.

టాక్సీ ఇంటి ముందు రెడీగా ఉంది

## ''హనీమూన్ ప్రారంభ సమయే...''

అప్పటికే!

''ఒరేయ్ కాముడూ! శాంతా! రండర్రా! దుర్ముహూర్తం వచ్చేస్తోంది. సామాన్లు జాగ్రత్త! లెక్కెట్టుకోండి'' అని బామ్మగారు హడావిడి పడిపోతున్నారు.

కామేశ్వర్రావు ఆనందంగా శాంత చేయి పట్టుకుని నడిపించుకుంటూ, కారు తలుపు తీసి తను కూర్చుని శాంతని కూర్చోబెట్టబోయాడు.

'ఆగమ్మాయి! మగాళ్ళు ముందు కూర్చుంటారు. నువ్వు వెనకనెక్కు'' అని గదమాయించేరు బామ్మగారు.

శాంత సిగ్గుతో వెనక సీట్లో కూచుంది.

''డ్రైవర్! కారు పోనీ! బామ్మా వస్తామే!'' అని కాముడు ఆర్డరు జారీ చేసేడు అందంగా 'హనీ! మూన్ ఛలో!'' అని హమ్మింగిస్తూ.

'డ్రైవరూ ఆగవయ్యా! ఆగు!'' అని కేక వేసి బామ్మగారు అటూ, ఇటూ చూస్తున్నారు- కాముడు గుండెల్లో రాయిపడ్డది.

'అమ్మా! నేనొచ్చేసాను. దారిలో ఒకడు 'సాలిగ్రామ దానం' చేస్తానంటేనూ, వెళ్ళేను. అందుకు ఒక్క అయిదు నిమిషాలు లేటయ్యేను. ఇదిగో నా సామాన్లు. ఒక మూట, ఒక సంచి, ఒక ట్రంకు పెట్టి. డ్రైవరు బాబూ! సామాను కార్లో పెట్టు. 'కాంబాబూ! కొంచెం జరగవయ్యా!'' అంటూ ''బ్రాహ్మడు''.

''అమ్మా! ఆ మూడు రాత్రుళ్ళు తంతు 'మదనపురం'లో నేను దగ్గరుండి శాస్త్రోక్తంగా జరిపిస్తా! నువ్వు నిశ్చింతగా ఉండు తల్లీ!'' బామ్మగారికి అదే నోటితో హామీ యిచ్చేశాడు.

భీమశాస్త్రి కారెక్కి ఓ చెంబుడు నీళ్ళు కారు ఇంజనులోను, స్టీరింగు మీద, దంపతుల నెత్తి మీద, డ్రయివరు నెత్తి మీద జల్లేసి, ''యిక పద''మన్నాడు.

''ఓం! అవిఘ్నమస్తు! హనీమూన్ యాత్ర ప్రారంభ సమయే, శ్రీ మహా గణపతి పూజాం కరిష్యే' అని మంత్రాలు చదువుతూ డ్రైవరు పక్క కూర్చుని 'డ్రైవర్! ఇక కారు వెనక్కి చూడకుండా తీసుకు పోవయ్యా' అని ఆజ్ఞాపించాడు.

బామ్మగారు ఆనందంగా నిట్టూర్చారు.

కాని కాముడు జుట్టు పీక్కుంటూ 'హనీ మూన్ నహీ! ఛలో ఇంట్లోకి!'' అని ఇంట్లోకి లాంగ్‌జంప్ చేసేడు కారులో నుంచి తేలు కుట్టినట్లు ఒక్క ''లంఘనం'' వేసి!




## రామాయణం ఎవరిసొమ్ము?

దేశంలోని టి.వి. ప్రేక్షకులను గతంలో ఆకట్టుకున్న 'రామాయణ్' నిర్మాతలు రామానంద్‌సాగర్ అండ్‌కో యిప్పుడు 'రామయణ్' పేరుతో ఫొటోలతో నిండిన 'కామిక్స్' పత్రికను వెలువరించారట. ఈ పత్రికను ఆపకుండా విడుదలచేసేందుకు చందమామ గ్రూప్ వారిని సాగర్ అండ్‌కోవారు అడిగారట.

ఈ కొత్త కామిక్స్ పత్రిక వెల ఐదురూపాయలు. రామాయణ్ సీరియల్ ద్వారా సొమ్ము చేసుకున్న సాగర్ అండ్‌కో ఈ 'కామిక్స్'ను ఎంతవరకు సొమ్ము చేసుకోగలరోనంటున్నారు అనేక మంది. మరి ఈ పత్రిక ఎంతవరకు విజయం సాధిస్తుందన్నది వేచిచూడాల్సిందే !